క్లుప్తంగా

పోలీసు పహారాలో యూరియా పంపిణీ



పోలీసుల బందోబస్తు మధ్య రైతులకు యూరియా పంపిణీ చేస్తున్న అధికారులు

కందుకూరు: మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయం వద్ద ఆదివారం సీఐ సీతారామ్, ఏఓ లావణ్య ఆధ్వర్యంలో యూరియా పంపిణీ కొనసాగింది. 450 బస్తాలు అందుబాటులో ఉండగా.. ముందుగా జారీ చేసిన టోకెన్ల వారీగా ఒక్కో రైతుకు రెండు బస్తాల చొప్పున యూరియా పంపిణీ చేశారు. సోమ, మంగళ వారాల్లో యూరియా రానుందని, మిగిలిన రైతులకు వచ్చిన వెంటనే పంపిణీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఎవరూ ఆందోళన చెందొద్దని సూచించారు.

కురుమ సంఘం ఆధ్వర్యంలో బారికేడ్లు



బారికేడ్లను ప్రారంభిస్తున్న సీఐ సీతారామ్, కురుమ సంఘం నాయకులు

కందుకూరు: కందుకూరులో కురుమ సంఘం టౌన్ అధ్యక్షుడు పాముల శ్రీశైలంకురుమ, ఎగ్గిడి రాజుకురుమ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ వద్ద ఏర్పాటు చేయడానికి బారికేడ్లను తయారు చేయించారు. ఆదివారం వాటిని సీఐ సీతారామ్‌తో పాటు కురుమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాస్పరి శంకర్‌కురుమ, జిల్లా అధ్యక్షుడు సిద్దుల దశరథకురుమ, కురుమ సంఘం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి ఎగ్గిడి సత్తయ్యకురుమ, మండల అధ్యక్షుడు అచ్చన పాండుకురుమ తదితరుల చేతుల మీదుగా ప్రారంభించారు. అన్ని రంగాల్లో కురుమలు ముందుకుసాగాలని ఈ సందర్భంగా వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కురుమ సంఘం నాయకులు సిద్దల శ్రీను, ఎగ్గిడి జగదీశ్వర్, ఎగ్గిడి పెద్ద ఐలయ్య, కందడి చంద్రయ్య, ఎగ్గిడి ఐలయ్య, ఏకుల మల్లేశ్, మోటె రమేశ్, పి.బాలయ్య, ఎ.బీరప్ప, పి.కృష్ణ, కె.నర్సింహ, ఎ.గణేశ్, శంకర్ పాల్గొన్నారు.

ఎస్కేడీనగర్ నూతన కమిటీ ఎన్నిక




ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని శ్రీకృష్ణదేవరాయనగర్ (ఎస్కేడీ) కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు ఆదివారం సమావేశమై నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అమరేందర్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడిగా సుధాకర్‌రెడ్డి, కన్వీనర్‌గా పుల్లారెడ్డి, కో కన్వీనర్‌గా బొమ్మ రఘురామ్‌నేత, ప్రధాన కార్యదర్శిగా శ్రీధర్‌రావు, కోశాధికారిగా ఎన్‌వీ కృష్ణారావు, ఉపాధ్యక్షులుగా పాపారావు, కేవీ రమణ, వి.నారాయణ, సంయుక్త కార్యదర్శిగా తులసీరెడ్డి, రూప్‌ల, నాగార్జునాచారి, ముఖేష్‌తో పాటు 12 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు నూతన అధ్యక్షుడు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీలో సమస్యలను పరిష్కరించి, అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

విజయశ్రీకాలనీ సీనియర్ సిటిజన్స్ ..

మన్సూరాబాద్: విజయశ్రీకాలనీ సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం సమావేశమై నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బీమిడి నర్సింహారెడ్డి, ఉపాధ్యక్షుడిగా వి.మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సీహెచ్ బాలరాజు, కార్యనిర్వాహక కార్యదర్శులుగా సుధాకర్‌రెడ్డి, సతీశ్‌బాబు, జాయింట్ సెక్రటరీలుగా నరేందర్‌గౌడ్, గులాల్ రెడ్డి, సాంస్కృతిక కార్యదర్శిగా సత్యనారాయణ, కోశాధికారిగా నల్లారెడ్డి, కార్యవర్గ సభ్యులుగా నర్సిరెడ్డి, మోహన్, ముత్యాలు ఎన్నికైనట్లు నూతన అధ్యక్షుడు తెలిపారు.

డివిజన్ బీజేవైఎం అధ్యక్షుడిగా మల్లేశ్‌యాదవ్



మల్లేశ్‌యాదవ్‌ను సత్కరిస్తున్న రంగారెడ్డి

హస్తినాపురం: హస్తినాపురం డివిజన్ బీజేవైఎం అధ్యక్షుడిగా గెలమోని మల్లేశ్‌యాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు డివిజన్ పార్టీ అధ్యక్షుడు ఎరుకల మల్లేశ్‌గౌడ్, నాయకుల సమక్షంలో ఆదివారం మల్లేశ్‌యాదవ్‌కు నియామక పత్రం అందజేశారు. ముఖ్య అతిథిగా సీనియర్ నాయకుడు సామ రంగారెడ్డి హాజరై మల్లేశ్‌యాదవ్‌కు శాలువా కప్పి సత్కరించారు. అనంతరం సామ రంగారెడ్డి మాట్లాడుతూ.. కేంద్రప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు.



మీర్‌పేట: సిర్లాహిల్స్‌లో గణనాథుడి మండపం వద్ద హోమం



బడంగ్‌పేట్: భీష్మ కాలనీలో..

బొజ్జగణపయ్యా.. విఘ్నాలు తీర్చయ్యా..

మహేశ్వరం నియోజకవర్గంలో వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఐదోరోజు ఆదివారం అన్ని గ్రామాల్లో వాడవాడలా వివిధ రూపాల్లో కొలువుదీరిన బొజ్జగణపయ్యకు భక్తులు, ఉత్సవ సభ్యులు ఘనంగా పూజలు నిర్వహించారు. ఉండ్రాళ్లు, వివిధ రకాల పిండి వంటలను స్వామివారికి నైవేద్యంగా సమర్పించి బొజ్జగణపయ్యా.. విఘ్నాలు తీర్చయ్యా అంటూ వేడుకున్నారు. పలు మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు.



పహాడీషరీఫ్: బాలాపూర్ గణనాథుడిని దర్శించుకున్న బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు విజయేందర్‌రెడ్డి, నాయకులు



తుక్కుగూడ: జెన్నాయిగూడ శ్రీలక్ష్మీనర్సింహాస్వామి ఆలయం వద్ద..



హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ వందనపురి కాలనీలో..



బడంగ్‌పేటలో.. మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్ తదితరులు

‘ఆపరేషన్ సింధూర్’ గణపతి

వినూత్నంగా నెలకొల్పిన కుమార్‌గౌడ్



పహాడీషరీఫ్: ఆ యువకుడు అందరినీ ఆకట్టుకునేందుకు నిత్యం సరికొత్తగా ఆలోచిస్తుంటాడు. అందులో భాగంగా ఈ ఏడు భిన్నమైన రీతిలో మండపాన్ని తీర్చిదిద్ది, గణపతి ప్రతిమను ప్రతిష్ఠించి ఔరా అనిపించాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మామిడిపల్లి గ్రామానికి చెందిన అల్లం కుమార్ గౌడ్.. స్థానికంగా మొబైల్ , ఎలక్ట్రికల్ దుకాణం నిర్వహిస్తున్నాడు. చవితి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఈ ఏడాది ‘ఆపరేషన్ సింధూర్’ థీమ్ వినాయకుడిని తన దుకాణంలో నెలకొల్పాడు. విఘ్నేశ్వరుడి విగ్రహం చిన్నదే అయినా.. మండపాన్ని జమ్మూ కశ్మీర్ పహల్గాంలో జరిగిన ఉగ్రదాడికి కౌంటర్‌గా జరిగిన ఆపరేషన్ సింధూర్‌ను ప్రతిబింబించేలా పెద్దగా తీర్చిదిద్దాడు. ప్రతిమ చుట్టూ అగ్ని, ఆకాష్ క్షిపణులతో పాటు ఎస్– 400 రైఫిల్స్, భారత సైనిక బలాన్ని సూచించే ఆర్మీ మోడల్ థీమ్‌లో నమూనాలను ఏర్పాటు చేశాడు. ఇలా గతంలో సందర్భాన్ని బట్టి.. మండపాలు సిద్ధంచేసి, విగ్రహాన్ని నెలకొల్పి ప్రజల మన్ననలు పొందుతున్నాడు.



ఆకట్టుకుంటున్న ఆపరేషన్ సింధూర్ నమూనా గణనాథుడి మండపం

బీసీల సంక్షేమానికి కృషి

పీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీశ్

మొయినాబాద్‌రూరల్: బీసీల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీశ్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కాంగ్రెస్ పార్టీ తీసుకొచ్చిన బిల్లులు రూపొందించిన సర్కార్.. దానిని అసెంబ్లీలో అన్ని పార్టీలు కలిసి ఏకగ్రీవ తీర్మానం చేయడం బీసీల వర్గానికి ఎంతో మేలు అన్నారు. కాంగ్రెస్ పార్టీకి కామారెడ్డి డిక్లరేషన్‌లో చేసిన తీర్మానానికి అనుగుణంగా అసెంబ్లీ సమావేశాలలో అన్ని పార్టీల సమక్షంలో బీసీలకు దారి చూపిందన్నారు. దీనికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పొన్నం ప్రభాకర్‌రెడ్డి కృషి ఎంతో ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో స్థానిక సంస్థలతో పాటు విద్యా, ఉద్యోగాలలో బీసీలకు చట్టబద్ధంగా 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ఇది అవకాశం అన్నారు.

రాహుల్‌గాంధీ.. మోదీకి క్షమాపణ చెప్పాలి

మహిళా మోర్చా జిల్లా కార్యదర్శి కావ్య

చేవెళ్ల: దేశ ప్రజలకు, ప్రధాని మోదీకి ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ క్షమాపణ చెప్పాలని బీజేపీ మహిళా మోర్చా జిల్లా కార్యదర్శి గౌండ్ల కావ్య, మండల నాయకుడు జి.కృష్ణాగౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు నగరంలోని ధర్నా కార్యక్రమానికి వెళ్లకుండా బీజేపీ నాయకులను పోలీసులు హౌజ్ అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీహార్ ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీపై, అతని తల్లిపై రాహుల్‌గాంధీ అనుచిత వ్యాఖ్యలు చేయటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. దీంతో దేశ ప్రజలు, బీజేపీ శ్రేణుల మనోభావాలు దెబ్బ తిన్నాయని ఆరోపించారు. ఈ వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళల పట్ల కాంగ్రెస్ పార్టీకి ఉన్న గౌరవం ఏమిటో అర్థం అవుతోందన్నారు. దీనికి నిరసనగానే రాష్ట్ర పార్టీ నగరంలో ధర్నాకు పిలుపునిచ్చిందన్నారు. ధర్నాకు వెళ్లకుండా మండలంలోని బీజేపీ నాయకులను ఎక్కడికక్కడే అరెస్టులు చేశారని, ఇది సరికాదన్నారు. దేశంలోని మహిళామణులు బీజేపీ శ్రేణులు అంతా కలిసి తగిన విధంగా కాంగ్రెస్ నేతలకు గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.

ఆలయ శాశ్వత నిర్వహణకు దాతృత్వం



షట్టర్ల ప్రారంభోత్సవంలో పాల్గొన్న యెలిశాల రవిప్రసాద్, ఎడ్ల కృష్ణారెడ్డి

మహేశ్వరం: మామిడిపల్లి గ్రామంలోని ప్రాచీనమైన దాసాంజనేయస్వామి ఆలయానికి దూప, దీప నైవేద్యాలకు తావులేకుండా చేసేందుకు వైష్ణోయ్ గ్రూప్ ముందుకొచ్చింది. ఆలయ నిర్వహణకు సొంత నిధులతో నిర్మించిన కమర్షియల్ షట్టర్లను గ్రూప్ చైర్మన్ యెలిశాల రవి ప్రసాద్, డైరెక్టర్ ఎడ్ల కృష్ణారెడ్డి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఐక్యతకు చిహ్నంగా నిలిచే మామిడిపల్లి గ్రామంలో విద్య, ఆధ్యాత్మికపరమైన అంశాలలో ఒకరికొకరం తోడ్పాటును అందించుకోవాలన్నారు. కార్యక్రమంలో మామిడిపల్లి ఆలయ చైర్మన్ ఎడ్ల వాసుదేవారెడ్డి, బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ కార్పొరేటర్లు సుక్క శివకుమార్, యాతం పవన్‌కుమార్ యాదవ్, బాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ కళ్లెం నరేశ్‌గౌడ్, నాయకులు లాల్ సతీశ్‌గౌడ్, కోట్ల రంగనాథ్, లిక్కి విజేందర్‌రెడ్డి, జగన్నాథరెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కనెక్షన్‌కు డబ్బులు ఇవ్వాలా?

కార్పొరేటర్‌కు కాలనీవాసుల విన్నపం



కార్పొరేటర్‌కు సమస్యను వివరిస్తున్న ఎస్‌బీఐ కాలనీవాసులు

మలక్‌పేట: ఇంటింటికీ తాగునీటి నల్లా కనెక్షన్ ఇచ్చేందుకు పలువురు కాంట్రాక్టర్లు డబ్బులు వసూలు చేస్తున్నారని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూసారంబాగ్ డివిజన్‌లో ఇటీవల రూ. 2.5 కోట్లతో ఎస్‌బీహెచ్ కాలనీ, ఎస్‌బీఐ ఆఫీసర్స్ కాలనీలో రూ.51 లక్షల నిధులతో చేపట్టిన తాగునీటి పైపులైన్ పనులను మలక్‌పేట ఎమ్మెల్యే బలాల, కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి ప్రారంభించారు. అయితే పనులు చేపట్టిన కాంట్రాక్టర్, ఓ అధికారి కలిసి పైపులైన్ కనెక్షన్ ఇచ్చేందుకు ఒక్కొక్కరి నుంచి రూ. 20 వేల నుంచి 40 వేలు వసూలు చేస్తున్నారని, ఉచితంగా కనెక్షన్ ఇవ్వాల్సి ఉండగా..ఎందుకు డబ్బులు వసూలు చేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. ఇదే విషయాన్ని కాలనీవాసులు డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆమె స్పందించి ఎవరికీ రూపాయి ఇవ్వొద్దని, ఉచితంగా కనెక్షన్ ఇస్తారని అప్పటివరకు కాలనీలకు వాటర్ ట్యాంకర్లతో తాగునీరు అందిస్తామని వారికి హామీనిచ్చారు. అలాగుపై అధికారులతో మాట్లాడి వారిపై చర్యలు తీసుకునేలా ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూస్తానని పేర్కొన్నారు.

అతిథి అధ్యాపకులకు దరఖాస్తుల ఆహ్వానం

చేవెళ్ల: చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కాంచనలత ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కళాశాల విద్యాశాఖ కమిషనర్ సూచనల మేరకు అతిథి అధ్యాపకుల దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని, డిగ్రీ కళాశాలలో కామర్స్ కోర్సులో బోధనకు ఈ నియామకాలను చేపడుతున్నట్లు తెలిపారు. ఇందుకు గాను సంబంధిత సబ్జెక్టులో పీజీ, డిగ్రీ పొంది ఉండాలని జనరల్ అభ్యర్థులు 55 శాతం, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 50 శాతం మార్కులు కలిగినవారు అర్హులన్నారు. నెట్, సెట్, పీహెచ్‌డీ వంటి అదనపు అర్హతలు కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఆసక్తి గల అర్హులైన అభ్యర్థులు తమ దరఖాస్తులను సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో చేవెళ్ల డిగ్రీ కళాశాలలో అందజేయాలని కోరారు. దరఖాస్తులను అందించేందుకు సెప్టెంబర్ 1వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు అవకాశం ఉంటుందని, ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం

మన్సూరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు అసెంబ్లీలో చట్ట సవరణ చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ తెలంగాణ రాష్ట్ర పెరిక క్షత్రియ కుల సంఘం ఆధ్వర్యంలో మన్సూరాబాద్ ఎంఈరెడ్డి గార్డెన్స్ సమీపంలోని గణేశ్‌నగర్ కాలనీ వద్ద సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి ఆదివారం పాలాభిషేకం చేశారు. రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్, పెరిక కుల కార్పొరేషన్ సాధకులు ముత్తినేని వీరయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. జనాభా దామాషా ప్రకారం బీసీలకు రాజ్యాధికారం అందాలనే రాహుల్‌గాంధీ ఆలోచనలను సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు కోట మల్లికార్జునరావు, సందరీవీరభాస్కర్, దాచెపల్లి రవి, ఎగ్గడి శ్రీనివాస్, మైలార్‌శెట్టి భాస్కర్, బల్దూరి రవి, లక్ష్మీనారాయణ, జూకూరి రాజు తదితరులు పాల్గొన్నారు.

రైతు బజార్‌లో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌లో కూరగాయల ధరల వివరాలు. టమాటా రూ.33, వంకాయ 45, బెండ 45, పచ్చిమిర్చి 40, కాకరకాయ 23, బీరకాయ 40, కాలిఫ్లవర్ 18, క్యాబేజీ 15, క్యారెట్ 47, దొండ 40, ఆలుగడ్డ 23, ఉల్లిగడ్డ 24, గోకరకాయ 35, దోసకాయ 23, సొరకాయ 15, పొట్లకాయ 35, అరటికాయ 11, చిక్కుడుకాయ 45, చామగడ్డ 25, మునగ 50, కందగడ్డ 40, బీట్‌రూట్ 25, కీర 18, బీన్స్ 50, క్యాప్సికమ్ 50.


సీనియర్ సిటిజన్స్‌కు క్రీడాపోటీలు

మన్సూరాబాద్: ప్రగతినగర్‌కాలనీలోని ఆదర్శ సీనియర్ సిటిజన్ సంక్షేమ భవనంలో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఇండోర్ గేమ్స్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. క్రీడలతో మానసికోల్లాసంతో పాటు ఆరోగ్యంగా ఉంటారన్నారు. అసోసియేషన్ నేతలు వీరారెడ్డి, సత్యనారాయణ, సోమిరెడ్డి, బ్రహ్మారెడ్డి, రాంరెడ్డి, సత్యనారాయణరావు, నవనీతరావు, రామచంద్రారెడ్డి, అమృతారెడ్డి పాల్గొన్నారు.

కార్పొరేటర్ హౌస్ అరెస్టు

నాగోలు: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తల్లిపై బీహార్‌లో కాంగ్రెస్ నాయకులు చేసిన అసభ్యకరమైన, అవమానకరమైన వ్యాఖ్యలకు నిరసనగా బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసనకు నాగోలు కార్పొరేటర్ చింతల అరుణ వెళ్లకుండా నాగోలు పోలీసులు ఆదివారం అమెను నివాసంలోనే ముందస్తుగా అరెస్టు చేశారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. ప్రజల గొంతుకను అణచివేయాలనే కాంగ్రెస్ ప్రభుత్వం యత్నం ప్రజాస్వామ్య విరుద్ధమన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



నాగోలు: జైపురికాలనీ శ్రీ శక్తి కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన వచ్చింది. ఈ సందర్భంగా లైఫ్ స్ప్రింగ్ హాస్పిటల్ డాక్టర్ చింతల అమని కాలనీవాసులను పరీక్షించి మందులు అందజేశారు. అలాగే వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జైపురికాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శ్యామల యాదగిరి, మహిళలు పాల్గొన్నారు.

బీసీలకు రిజర్వేషన్లు కేటాయించాలి

బీసీసేన జాతీయ అధ్యక్షుడు కృష్ణ



పోతుగల్‌లో నూతన కమిటీ సభ్యులకు నియామకపత్రం అందజేస్తున్న కృష్ణ

షాబాద్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కేటాయించాలని బీసీసేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని పోతుగల్, సీతారాంపూర్ గ్రామాల్లో నూతన కమిటీ సీతారాంపూర్ అధ్యక్షుడిగా యాదయ్య, ఉపాధ్యక్షుడిగా బాలకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా పాండు, యువజన అధ్యక్షుడిగా రమేష్, పోతుగల్ గ్రామ అధ్యక్షుడిగా వీరంపల్లి యాదయ్య, ఉపాధ్యక్షుడిగా మురళీగౌడ్, ప్రధాన కార్యదర్శిగా ఒగ్గు నవీన్, యువజన అధ్యక్షుడిగా కావలి అరవింద్, ఉపాధ్యక్షుడిగా కుమ్మరి నవీన్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీల హక్కుల కోసం నిరంతర పోరాటం చేస్తామని, జనాభాలో అత్యధికంగా ఉన్న బీసీలకు అన్ని విధాలా అన్యాయం జరుగుతుందన్నారు. బీసీలకు స్థానిక సంస్థలలో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీలందరూ రాజకీయంగా ఆర్థికంగా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని సూచించారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలందరూ పోటీకి సిద్ధంగా ఉండాలని చెప్పారు. బీసీల హక్కుల సాధనకు తాము నిరంతరం పోరాటం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో బీసీసేన మండల అధ్యక్షులు దయాకరచారి, ఉపాధ్యక్షులు మీరంపల్లి అజయ్‌కుమార్, నాయకులు మహేందర్, శ్రీశైలం, శివ, అబ్బాస్, మాజీ సర్పంచ్ సురేష్‌గౌడ్, మాజీ ఉపసర్పంచ్ సందీప్, రాములు, చారి, బాలకృష్ణ, పాండు, శ్రీనివాస్ ముదిరాజ్, సురేష్, జగన్, వెంకటయ్య, రాజుగౌడ్, మల్లేష్, పోచయ్య, వెంకటేష్, జైపాల్, కృష్ణ, శ్రీశైలం, ఆనంద్, తదితరులున్నారు.

కేంద్ర పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లాలి

స్థానిక సంస్థల మండల కన్వీనర్ మహేశ్



పోమాల్‌పల్లిలో కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

కేశంపేట: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లాలని స్థానిక సంస్థల మండల కన్వీనర్ కంచుకోట మహేశ్ అన్నారు. మండల పరిధిలోని తొమ్మిదిరేకుల, పోమాల్‌పల్లి, దేవునిగుడితండాల్లో ఆదివారం గడప గడపకూ బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ పసుల నర్సింహాయాదవ్‌తో పాటు మహేశ్ పాల్గొని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలో అమలు అవుతున్న పథకాలపై ప్రజలకు వివరించాలని సూచించారు. రైతులకు సబ్సిడీపై యూరియాను అందిస్తుందని, నిరుపేదలకు ఉచితంగా సన్నబియ్యం విషయాలను ప్రజలకు వివరించాలన్నారు. గ్రామాల్లో రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న ఇళ్లలో కూడా కేంద్ర ప్రభుత్వ వాటా ఉన్న విషయాన్ని లబ్ధిదారులకు, గ్రామస్తులకు తెలియజేయాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి కల్వకోలు తిరుపతి, ఉపాధ్యక్షుడు కంచుకోట నర్సింలు, ఎస్టీ మోర్చా నాయకులు రాజు నాయక్, జెట్టూరి గోపాల్‌రెడ్డి, కుమారస్వామిగుప్తా, కృష్ణయాదవ్, శ్రీనివాస్‌గౌడ్, అకుల గోపాల్, చాకలి మహేందర్, లాలమోని యాదగిరి, శ్రీరాములునాయక్, మహేశ్, శివ, రాజు, చింటూ, వంశీ తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతతోనే హక్కులు సాధ్యం

ముదిరాజ్ సంఘం రాష్ట్ర నాయకుడు బాబయ్య



జెండా ఆవిష్కరణలో పాల్గొన్న సంఘం నాయకులు

షాద్‌నగర్: ముదిరాజ్‌లు ఐక్యతతో ముందుకు సాగాలని, తద్వారా తమ హక్కులను సాధించుకోవచ్చని ఆ సంఘం రాష్ట్ర నాయకుడు అందె బాబయ్య అన్నారు. ఆదివారం ఫరూఖ్‌నగర్ మండలం రాయికల్‌లో గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ముదిరాజ్ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బాబయ్య హాజరై మాట్లాడుతూ.. ముదిరాజ్‌లు సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో రాణించాలని సూచించారు. ముదిరాజ్‌ల సంక్షేమానికి పాలకులు తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ముదిరాజ్‌లు అందరూ ఐక్యతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం తాలుకా గౌరవ అధ్యక్షులు చెట్ల జంగయ్య, అంచరాములు, అందె పైలయ్య, తాలుకా యువ అధ్యక్షుడు శ్రీధర్‌వర్మ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.